## క్లుప్తంగా

### రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు శిర్లపాలెం విద్యార్థిని


పోతల వాగ్దేవి

ఆనందపురం: మండలంలోని శిర్లపాలెం ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పోతల వాగ్దేవి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు బుధవారం విద్యార్థినిని పాఠశాల సిబ్బంది అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో వాగ్దేవి ప్రథమ స్థానం సాధించింది. ఈ నెల 25న లంకెలపాలెంలో జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి జట్టులో స్థానం సంపాదించింది. కర్నూలు జిల్లా నంద్యాలలో త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలో వాగ్దేవి పాల్గొంటుందని వ్యాయామ ఉపాధ్యాయుడు బుత్తల సత్యం తెలిపారు. హెచ్‌ఎం శారద, సర్పంచ్ శిర్ల అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు బోని అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ షిణగం అప్పలరాజు, విద్యా కమిటీ చైర్మన్ బి.పైడినాయుడు తదితరులు వాగ్దేవిని అభినందించారు.

### విలాస్కాన్‌పాలెం మాజీ సర్పంచ్ మృతి


అప్పలస్వామి (ఫైల్)

పద్మనాభం : మండలంలోని విలాస్కాన్‌పాలెం మాజీ సర్పంచ్ రామసింగు అప్పలస్వామి (90) బుధవారం మృతి చెందారు. 1969 నుంచి 1994 వరకు విలాస్కాన్‌పాలెం సర్పంచ్‌గా ఆయన పని చేశారు. బాందేవుపురం సహకార సంఘ అధ్యక్షునిగా కూడా ఆయన సేవలందించారు. విలాస్కాన్‌పాలెం గ్రామానికి 1982లో విద్యుత్ సౌకర్యం కల్పించారు.

### విద్యార్థులకు పోటీలు

తగరపువలస: హిందీ భాష పక్షోత్సవాల్లో భాగంగా భీమిలి ఆదర్శహిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పండిట్ నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని తిరుమల శ్రీదేవి, ఉపాధ్యాయులు వి.నాగభూషణం, భారతి, లక్ష్మి, గీత తదితరులు పాల్గొన్నారు.

### ల్యాండ్ పూలింగ్ భూముల పరిశీలన


నేరేళ్లవలసలో భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో భాస్కరరెడ్డి

పద్మనాభం: మండలంలోని నేరేళ్లవలసలో గల సర్వే నంబర్ 102లో ల్యాండ్ పూలింగ్ కింద సేకరించిన భూములను బుధవారం ఆర్డీవో భాస్కరరెడ్డి పరిశీలించారు. ఈ భూముల్లో ఉన్న మామిడి చెట్లు తీసుకోవడానికి సమయం ఇవ్వాలని రైతులు ఆయనకు విన్నవించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ వేణుగోపాల్, వీఆర్వో సత్యం దొర ఉన్నారు.

### బులుసు వెంకటేశ్వర్లుకు ప్రత్యేక పురస్కారం



బులుసు వెంకటేశ్వర్లు

తగరపువలస : ప్రముఖ పద్యకవి బులుసు వెంకటేశ్వర్లు ఎన్టీఆర్ కృష్ణా జిల్లా అవనిగడ్డకు చెందిన మండలి ఫౌండేషన్ నుంచి ప్రత్యేక పురస్కారానికి ఎంపికయ్యారు. తెలుగు సంస్కృతి, భాషా విశిష్టతను వర్ణిస్తూ నిర్వహించిన గేయ కవిత్వ పోటీలలో ఆయన రాసిన ×తెలుగుతల్లికి చందనం పూద్దాం×అనే గీతానికి గాను ఈ పురస్కారం లభించింది. ఇటీవల పద్య కావ్యాలకు సంబంధించి ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) నిర్వహించిన పోటీలలోను బులుసు రూ.లక్ష నగదు బహుమతి, పురస్కారం గెలుచుకున్న సంగతి తెలిసిందే. నిత్య రచనా వ్యాసంగంలో తెలుగు భాషకు సేవ చేస్తున్న బులుసు వెంకటేశ్వర్లును పలువురు సాహితీవేత్తలు అభినందిస్తున్నారు.



# పార్వతీ తనయునికి ప్రత్యేక పూజలు

- కనుల పండువగా దీపారాధన


పుట్టలో వినాయకునికి పాలు పోస్తున్న ఆవు విగ్రహం


సామూహిక పూజల్లో పాల్గొన్న మహిళలు


బాందేవుపురంలో గణపతికి పూజలు చేస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల


మారికవలసలో ఆకట్టుకున్న దీపారాధన

మధురవాడ : వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మారికవలస ఆర్‌జీకే కాలనీలో కనుల పండువగా దీపారాధన నిర్వహించారు. ఇక్కడ 39, 40, 98, 99, 100 బ్లాకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకల్లో ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు విశేషంగా తరలి వచ్చి దీపాలు వెలిగించారు. మధ్యాహ్నం మండపం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు, జేసీఎస్ ఇన్‌చార్జి పోతిన సురేష్ అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారణాసి శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు. అలాగే రేవళ్లపాలెం రోడ్డులో కూడా అన్నదాన కార్యక్రమం జరిగింది.

**బాందేవుపురంలో అన్నదానం..**

పద్మనాభం : మండలంలోని బాందేవుపురంలో వినాయక ఉత్సవాల్లో భాగంగా బుధవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా వినాయక విగ్రహం వద్ద పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రేవిడి ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు, నమ్మి వెంకటరావు, బాందేవుపురం యువత పాల్గొన్నారు.

**గణపతికి గరిక పూజలు..**

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడలో సుత్తమ్మతల్లి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వినాయకునికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల వెంకటాచల చరిత్రలో ముఖ్య ఘట్టమైన శ్రీనివాసునికి ఆవు పాలు ఇచ్చే ఘటన ఆధారంగా పుట్టలో వినాయకునికి ఆవు పాలు ఇచ్చేలా విగ్రహాన్ని రూపొందించారు. అర్చకుడు యశ్వంత్ శర్మ ఆధ్వర్యంలో మహిళలు గణపతికి దూర్వాయుగ్మ, శ్వేతకమలాలు, బిల్వ దళార్చన పూజలు చేశారు.

# సీఎం జగన్ నిర్ణయం సాహసోపేతం


పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాగవంశ జేఏసీ ప్రతినిధులు

తగరపువలస : రాష్ట్రంలో వందేళ్ల తర్వాత కులగణనపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం, సాహసోపేతమైనదని నాగవంశ రాష్ట్ర కార్పొరేషన్ ప్రతినిధులు, రాష్ట్ర జేఏసీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహరాజుపేట కూడలి వద్ద బుధవారం నాగవంశ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బొడ్డు అప్పలకొండమ్మ అధ్యక్షతన జరిగిన నాగవంశీయుల సమావేశంలో పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఎందరో ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులు చేయలేని కులగణన ముఖ్యమంత్రి జగన్ జోక్యంతో జరగడం చూస్తుంటే అంబేడ్కర్, జ్యోతిరావు పూలే వంటి మహానుభావుల కలలు నెరవేరుతాయన్నారు. జగన్ సీఎం అయ్యాక బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా, మైనారిటీలకు ఉప ముఖ్యమంత్రులుగా పెద్దపీట వేశారన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలలో కులాల పరిస్థితులు అధ్యయనం చేసి నివేదిక సమర్పిస్తారన్నారు. కులగణన చేపట్టడం ద్వారా రాష్ట్రంలో వెనుకబడిన సామాజిక వర్గాల వారితో పాటు నాగవంశీయులకు కూడా జనాభా ప్రాతిపదికన రాజకీయ, సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ ఫలాలు అందుతాయన్నారు. ఈ సమావేశంలో నాగవంశం జిల్లా కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డు అప్పలనాయుడు, రాష్ట్ర జేఏసీ సభ్యులు నింగిబోతు జనార్దన్, నల్లి రవికిరణ్, ఎరిప్లంటి కృష్ణ, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్లు అవనాపు లక్ష్మణరావు, బోని అప్పలనాయుడు, నల్లి ఆశాదీపిక, కార్పొరేటర్ కంటుభుక్త తవిటిరాజు, సర్పంచ్ గాడు వెంకటనారాయణ, మాజీ ఎంపీపీ కాళ్ల నగేష్, సాలూరు సెంట్రల్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ జరజాపు ఈశ్వరరావు, జరజాపు సూరిబాబు, విశాఖ జేఏసీ సభ్యులు నామాల తిరుపతిరావు, సంకురుభుక్త జోగారావు, కాళ్ల అప్పలసూరి, డొంక ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వినూత్న బోధనతో మెరుగైన ఫలితాలు


బోధనా విధానంపై అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయులు సింహాచలం

భీమునిపట్నం: పాఠ్యాంశాల బోధనలో నూతన విధానాలు అవలంభించాలని, తద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యం మెరుగుపడుతుందని మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ సింహాచలం అన్నారు. బుధవారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఎకడమిక్ క్యాలెండర్ ప్రకారం పాఠ్యాంశాల బోధన, విద్యా విధానం మెరుగుపరిచే పద్ధతులపై ఎంఈవోలు శివరాణి, జయప్రదల పర్యవేక్షణలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా విధానంలో ఎన్నో గొప్ప మార్పులు చేసి అభివృద్ధి చేస్తోందన్నారు. ఉపాధ్యాయులు బోధనలో మెలకువలు పాటించాలన్నారు. ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ అంశాలపై అవగాహన చేసుకుని విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలన్నారు. అన్ని పాఠశాలల్లో డిజిటల్ తరగతులు నిర్వహించవలసి ఉందని, అందుకోసం స్మార్ట్ టీవీలను ప్రభుత్వం పాఠశాలలకు అందించిందని అన్నారు. దాని ప్రకారం ప్రత్యేక బోధన చేస్తే విద్యార్థులు డిజిటల్ విధానంలో పాఠ్యాంశాలు నేర్చుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. పాఠ్య ప్రణాళిక, టీచింగ్ నోట్స్ సిద్ధం చేసుకుని బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ రెడ్డిపల్లి అప్పలరాజు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ అడపా వంశీధర్ పాల్గొన్నారు.

# కేవీపీఎస్ మహా ధర్నా జయప్రదానికి పిలుపు


ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మధురవాడ: దళిత హక్కుల పరిరక్షణ కోసం ఈ నెల 29న విజయవాడ ధర్నాచౌక్ వద్ద జరిగే మహా ధర్నాకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి ఎం.వి.ప్రసాద్ పిలుపునిచ్చారు. మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా పోస్టర్‌ను ఇతర నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వరంగం అంతటినీ ప్రైవేటుపరం చేస్తూ గిరిజన, దళిత, బీసీ తదితర వర్గాలకు రిజర్వేషన్ లేకుండా కేంద్ర ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వరంగాన్ని కాపాడుకోవడం, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ అమలు కోసం ఈ ధర్నా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కనెక్షన్ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని, ఈ పరిమితిని 300 యూనిట్లకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మధురవాడ నాయకులు సియాద్రి పైడితల్లి, కె.నాగరాజు, బి.వరలక్ష్మి, ఎస్.రమణమ్మ, సరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

### వినియోగంలోకి బోరు విద్యుత్ మోటార్

పద్మనాభం : పద్మనాభం పంచాయతీ ఇసకలపాలెంలో తాగునీటికి సంబంధించి మరమ్మతులకు గురైన బోరు విద్యుత్ మోటార్‌ను తన సొంత నిధులు రూ.5 వేలతో బాగు చేయించినట్టు బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు హెచ్. మహేష్ తెలిపారు. విద్యుత్ మోటారు, ప్యానల్ బోర్డు బాగు చేయించినట్టు ఆయన చెప్పారు.

# ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ


విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం : మద్దిలో రచ్చబండ వద్ద నిలిపిన వినాయక ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బుధవారం ఎంపీపీ కంటుబోతు రాంబాబు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, బుగత శ్రీనివాసరావు, బుగత ఎర్నాయుడు పాల్గొన్నారు. అనంతరం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. పులి వేషాలు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ వినాయకుని ఊరేగించి రాజు వెంకటపతి రాజు చెరువులో వినాయకుని నిమజ్జనం చేశారు.

# గిరిజన వైద్య విద్యార్థికి ఐటీడీఏ ఆర్థికసాయం

- ఇషాక్‌కు మొదటి సంవత్సరం ఫీజు కేటాయింపు
- రూ. 1,65,500 చెల్లించిన కలెక్టర్ సుమిత్‌కుమార్


ప్రిన్సిపాల్ సుధాకర్ బాబు నుంచి అడ్మిషన్ పత్రం అందుకుంటున్న ఇషాక్

మధురవాడ : వైద్య విద్యార్థి కె.ఇషాక్‌కు మొదటి సంవత్సరం ఫీజు రూ.1,65,500ను అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ నుంచి కలెక్టర్ సుమిత్ కుమార్ అందజేశారు. చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీ ఈదులబయలు గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి ఇషాక్ మధురవాడలోని మారికవలస ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల సంస్థలో శిక్షణ పొందాడు. నీట్–2023 పరీక్షల్లో 420 మార్కులు సాధించి, ఆలిండియా స్థాయి ఎస్టీ కేటగిరీలో 3073 ర్యాంకు సాధించాడు. విశాఖలో ఎన్‌ఆర్‌ఐ వైద్య కళాశాలలో సీటు వచ్చింది. అతని వైద్య విద్యకు సంబంధించి మొదటి సంవత్సరం ఫీజును కలెక్టర్ సుమిత్‌కుమార్ అందజేయడంతో ఆర్థికభారం తప్పిందని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ ఎల్.శివప్రసాద్ తెలిపారు.

## త్రోబాల్ పోటీలు, ఎంపికలు వాయిదా

అగనంపూడి: ఈనెల 30న నిర్వహించాల్సిన ఎస్‌జీఎఫ్ ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి అండర్–17 బాలురు, బాలికల విభాగం త్రోబాల్ పోటీలు, ఎంపికలు వాయిదా వేసినట్టు ఎస్‌జీఎఫ్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు తెలిపారు. 30వ తేదీన స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించేందుకు విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో త్రోబాల్ ఎంపికలు వాయిదా వేసినట్టు ఆయన తెలియజేశారు.

## 29 నుంచి యోగా తరగతులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో ఈ నెల 29 నుంచి సాధారణ యోగా, థెరపటిక్ యోగా, మెడ, వెన్ను నొప్పి నివారణకు ప్రత్యేక శిబిరాలు ప్రారంభిస్తున్నట్లు కేంద్రం గౌరవ సంచాలకులు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు తరగతులు జరుపుతామన్నారు. ఆసక్తి కలిగినవారు 9398019922, 9494401919, 8374351324లో సంప్రదించాలని సూచించారు.

## పర్యాటక రంగంలో ఉద్యోగావకాశాలు ఎక్కువ

ఆరిలోవ: పర్యాటక రంగంలో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫణికుమార్ తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇక్కడ వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు రెండు రోజుల పాటు పోటీలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో శిక్షణ పొందాలన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు కస్తూర్బా విద్యార్థినులు


రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన కస్తూర్బా విద్యార్థినులు

పద్మనాభం : పద్మనాభం కస్తూర్బా విద్యాలయానికి చెందిన ఆర్.శిరీష, పి.ధనలక్ష్మి, పి.స్రవంతి, వి.పావని, జి.దివ్య ఫుట్‌బాల్ అండర్–17 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పి.ధనలక్ష్మి, పి.దివ్య, ఎం.అలేఖ్య, ఆర్.శిరీష హ్యాండ్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు, తనూజ అండర్–14 ఫుట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని కస్తూర్బా ఎస్‌వో గ్రేస్ లిల్లీ, పీఈటీ, సీఆర్‌టీలు అభినందించారు.

# వాడవాడలా అన్నసంతర్పణలు


బోయిపాలెంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముత్తంశెట్టి మహేష్


గాంధీబొమ్మ వీధిలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు


గ్రంథాలయ వీధిలో అన్నప్రసాదం వద్ద ఉత్సవ కమిటీ ప్రతినిధులు, బాలగణపతి యూత్

తగరపువలస: గణేష్ ఉత్సవాల్లో భాగంగా బుధవారం భీమిలి అర్బన్, రూరల్ పరిధిలో పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. మండలంలోని తాటితూరు పంచాయతీ కాగితాలపేటలో క్రేజీ యూత్ భారీ అన్నసమారాధన నిర్వహించింది. ఒకటో వార్డు గాంధీబొమ్మ వీధిలో 5 వేల మందికి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. రెండో వార్డు ఊళ్లపేటలో పోలమాంబ యూత్ అసోసియేషన్ తరఫున వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అక్కరమాని మంగరాజు అన్నదానం ప్రారంభించారు. గ్రంథాలయ వీధిలో బాలగణపతి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానంలో వైఎస్సార్‌సీపీ 2వ వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు కుంచం సురేష్, కుంచం శ్రీకాంత్, నీలాతి శ్రీను, ఊడికల చైతన్య, దువ్వి రవి, సాయి, బొట్టా మధు, తెడ్లాపు అశోక్, జస్వంత్, గేదెల వెంకటేష్, తంగేటి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

**బోయిపాలెంలో 2 వేల మందికి..**

ఆనందపురం: మండలంలోని గంభీరం పంచాయతీ బోయిపాలెంలో భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో యువత ఐక్యగా ఉండి అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. సుమారు 2 వేల మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బొట్టా ధనలక్ష్మి, బొట్టా రామకృష్ణ, మండల మాజీ వైస్ ఎంపీపీ ఉప్పాడ సూరిబాబు, తెడ్లాపు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.


ఊళ్లపేటలో అన్నదానం ప్రారంభిస్తున్న మంగరాజు

### క్లాప్ వాహనాల డ్రైవర్ల నిరసన


నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

మధురవాడ: జీవో నంబర్ 7 ప్రకారం క్లాప్ వాహనాల డ్రైవర్లకు రూ.18,500 జీతం ఇవ్వాలని సీఐటీయూ మధురవాడ జోన్ ప్రధాన కార్యదర్శి పి.రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో రెండో రోజు బుధవారం నిర్వహించిన సమ్మెలో 7వ వార్డు కార్యాలయం వాహనాల యార్డు వద్ద డ్రైవర్లు బైఠాయించి నిరసన తెలియజేశారు. జీవీఎంసీలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించి వాహనాల డ్రైవర్లు మంగళవారం నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లారని, దీనికి అధికార యంత్రాంగానిదే బాధ్యతని విమర్శించారు. డ్రైవర్ల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకూ సమ్మె కొనసాగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.చిన్న, కె.సన్ని, పి.అశోక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పూర్తి వివరాలతో డ్రాఫ్ట్ నోటిఫికేషన్


పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో భాస్కరరెడ్డి

భీమునిపట్నం: భీమిలి నియోజకవర్గానికి సంబంధించిన పూర్తి ఓటర్ల జాబితాతో కూడిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను అక్టోబర్‌లో విడుదల చేస్తామని ఆర్డీవో, నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎస్.భాస్కరరెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఓటర్ల జాబితాల పరిశీలనలు, తొలగింపులు, కొత్తగా నమోదు మొదలైనవి చాలా జాగ్రత్తగా నిర్వహించారన్నారు. ఈ వివరాలతో కూడిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను రూపొందిస్తామని చెప్పారు. ప్రస్తుతం ఓటర్ల సంఖ్య 3,39,909 ఉండగా.. కొత్తవి కలుపుకుని మొత్తం 340 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. వచ్చే నవంబర్ 30 వరకు కొత్త ఓటర్ల నమోదుతోపాటు ఇతర సవరణలు, అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. కొత్త ఏడాది జనవరి 5న సమగ్ర వివరాలతోకూడిన తుది జాబితాకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని వెల్లడించారు. సమావేశంలో ఆయా పార్టీల నాయకులు చెన్నాదాసు, కె.చంద్రశేఖర్, గంటా నూకారాజు, చందరరావు, కంటుభుక్త రామానాయుడు, కదిరి జగన్నాథం, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ భాస్కరరావు పాల్గొన్నారు.

# అంధకారంలో సర్వీసు రోడ్డు

పీఎం పాలెం: వైఎస్సార్ క్రికెట్ స్టేడియం కూడలి నుంచి ప్రారంభం అయ్యే సర్వీసు రోడ్డు పొడవునా వీధి లైట్లు లేకపోవడంతో అంధకారం రాజ్యమేలుతోంది. ఈ రోడ్డులో ఉన్న బస్టాపుకు చీకటి పడిన తర్వాత చేరుకోవాలంటే ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందో అని పాదచారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డులో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డులో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన


గొల్లల ఎండాడలో శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ లొడగల అప్పారావు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు గొల్లల ఎండాడలో జీవీఎంసీ నిధులు రూ.41 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి బుధవారం కార్పొరేటర్ లొడగల అప్పారావు శంకుస్థాపన చేశారు. గతంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ సమస్యను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు దృష్టికి తీసుకు రాగా.. ఆయన ఆదేశాల మేరకు పనులు ప్రారంభించినట్లు కార్పొరేటర్ అప్పారావు తెలిపారు. వార్డులో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, జేసీఎస్ వార్డు ఇన్‌చార్జి ఉప్పులూరు గోపి, స్థానిక నాయకులు లొడగల రామ్మోహన్, అల్లాడ ఉమామహేశ్వరరావు, నొడగల రాంబాబు, మాదు చంటి, బొబ్బిలి చిన్న, అప్పలస్వామి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.